జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక


మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 23-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 570 పేజీలు: 4 వెల : రూ.7

# రిమ్స్ సిబ్బంది.. నిర్లక్ష్యం

* ఒకరికి బదులు ఇంకొకరికి కుక్క కాటు టీకా
* ఆందోళనలో బాలుడి బంధువులు
* వాగ్వాదానికి దిగిన స్టాఫ్‌నర్సులు
* ఆసుపత్రి ఆవరణలో బైఠాయించిన బంధువులు
* సముదాయించిన ఆర్ఎంవో, ఎస్ఐ, సిబ్బంది



**శ్రీకాకుళం క్రైం, జనవరి 22 (వార్త):** సర్వజనీన ఆసుపత్రి (రిమ్స్)లో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఏకంగా ఆసుపత్రికే చెడ్డపేరు వస్తోంది. అసలే ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి ఉంది. పర్యవేక్షణ అనేదే ఉండదు. సిబ్బంది, వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారు. రెగ్యులర్ సిబ్బంది కన్నా ఔట్‌సోర్సింగ్ సిబ్బందే అధికంగా ఉండడం, వారిలో కొంతమంది ఆయా విభాగాధితులకు తొత్తులుగా ఉండడంతో ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. కొందరు సిబ్బంది, వైద్యులు రోగులకు ఓపికగా సేవలు అందిస్తున్నప్పటికీ కొందరి నిర్వాకం వల్ల అందరినీ తప్పుపట్టాల్సిన పరిస్థితి దాపురించింది. గాయమైందని వెళ్లిన బాలుడికి.. ఓ స్టాఫ్‌నర్సు కుక్క కాటు టీకా వేయడంతో గురువారం ఆసుపత్రిలో రచ్చరచ్చ అయింది. సామాజిక మాధ్యమాల్లో ఈవిషయం వైరల్ అయింది. వివరాల్లోకి వెళితే.. బలగ ప్రాంతానికి చెందిన బలగ శ్యామ్ గురువారం సాయంత్రం ఆడుకుంటూ కిందపడి గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబీకులు అతడిని రిమ్స్‌కు తరలించారు. ఎమర్జన్సీ విభాగంలో వైద్యులు అతడిని పరీక్షించి మందులు ఇచ్చారు. అయితే ఇదే సందర్భంలో ఓ బాలుడు కుక్క కరిచిందని రిమ్స్ అత్యవసర విభాగానికి వచ్చాడు. అయితే అక్కడ డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్స్.. ఓ బాలుడికి కుక్కకాటు టీకా వేయాల్సివుండగా, శ్యామ్‌కు తీసుకువెళ్లి టీకా వేయించింది. దీన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్కడున్న సిబ్బందికి, కుటుంబీకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఆర్ఎంవో డాక్టర్ బాలసుభాషిణి అక్కడకు వచ్చి సముదాయించే ప్రయత్నం చేశారు. కుక్క కాటు టీకా వేసినా ఎటువంటి అపాయం ఉండదని తెలిపారు. స్టాఫ్‌నర్సుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ ఎస్ఐ మధుసూదనరావు రిమ్స్‌కు వచ్చి బాలుడి కుటుంబీకులకు వారించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.



## అరసవల్లి వేడుకలను దిగ్విజయం చేయండి

* రాష్ట్ర పండుగగా రథసప్తమి
* అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
* అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం
* క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన



4లో

## అధికారులకే.. పాస్‌లు!

* సాంస్కృతిక కార్యక్రమాల్లో వారి బంధువులకే అగ్రతాంబూలం
* సామాన్య ప్రజలకు.. స్టాండింగ్ షో
* కొందరు అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



4లో

## మరో ఆరు నెలల్లో.. విద్యుత్ బస్సులు

* చార్జింగ్ స్టేషన్లు నిర్మిస్తాం
* సంక్రాంతికి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాం
* సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు అమూల్యం
* ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు




4లో



# గిడుగుకు ఘన నివాళి



**ఇచ్ఛాపురం, జనవరి 22 (వార్త):** వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు, మహానుభావుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతిని పంజా స్ట్రీట్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గిడుగు వెంకట రామమూర్తి గారి జీవితం, సేవలు, తెలుగుభాషకు చేసిన కృషి గురించి ప్రసంగించారు. ప్రజల భాషే గ్రంథ భాష కావాలన్న ఆయన ఆశయాన్ని స్మరించు కుంటూ, వ్యవహారిక భాష ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాణి, దుర్గమ్మ, శైలజ, సౌజన్య, సుశీల, నాగ మణి, కో అప్టెడ్ సభ్యులు కాళ్ల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు

# రైతన్నల ఆదాయ వృద్ధికి ఆధునిక పద్ధతులే మార్గం

## -ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస, జనవరి 22(వార్త):** ఆమదాలవలసలో రైతుల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వ్యవసాయ సాంకే తిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం పశుసంవర్ధక శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని పాతినా వారి వీధిలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ ఆధునిక పశుపోషణ పద్ధతులు రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంలో శాస్త్రీయ విధానాలు అనుసరిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వ్యవ సాయ, పశుసంవర్ధక శాఖ పథకాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. శిక్షణా కార్యక్రమాల ద్వారా పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక రంగ నిపుణులు పశువుల ఆరోగ్యం, సమతుల్య పోషకాహారం, వ్యాధుల నివారణ, నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు లకు విపులంగా వివరించారు. పశువుల బీమా, టీకాలు, మెరుగైన జాతుల ఎంపిక వంటి అంశాలపై రైతుల సందే హాలకు సమాధానాలు ఇచ్చారు. దూడల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రైతులు ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించి, పశుపోషణపై మరింత అవగాహన పొందారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# శోభాయాత్రలో అలరించిన జానపద కళా బృందం



**పలాస, జనవరి 22 (వార్త):** కడపలో జరుగుతున్న శ్రీరామ మహా శోభాయాత్రలో కళాబృందం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ యాత్రలో మన జిల్లాకు చెందిన తప్పెట గుళ్లు కళా రూపానికి ఒక ప్రత్యేకత స్థానం ఉంటుంది. చీపురుపల్లి గ్రామానికి చెందిన పాలిన శంకర్రావు బృందానికి అవకాశం కల్పిస్తూ ఆదరిస్తున్నారు. శృతిలయ పద నృత్య విన్యాసాలతో సాగుతున్న ఈ ప్రదర్శన అధ్యంతం భక్తులను ఆకర్షిస్తున్నది. ప్రధానంగా రామాయణంలోని సుందరాకాండ ఘట్టాలను ఆలపిస్తూ సాగుతున్న ఈ నృత్యానికి భక్తులు కానుకలు ఇస్తూ అభినందిస్తున్నారు. ఈ బృందానికి నిర్వహణ కమిటీ సన్మాన సత్కారాలతో రెండు రోజులు ఆతిథ్యం ఇచ్చి ఎంత మంచి అవకాశాన్ని ఇచ్చినటువంటి శ్రీరామ మహాశోభాయాత్ర నిర్వహణ కమిటీకి రంగం ప్రజా సంస్కృతిక వేదిక రాష్ట్ర కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని తప్పెట గుళ్లు కళాబృందం తెలిపారు.

# జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు గాలికి సత్కారం




**పలాస, జనవరి 22 (వార్త):** జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా పలాసకు చెందిన గాలి కృష్ణారావు ఎంపికైనందుకు నవజ్యోతి సేవాసమితి తరపున గురువారం ఘనంగా సత్కరించారు. పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు గుర్తింపునిస్తాయని వక్తులు కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గాలి కృష్ణారావును సత్కంచడంలో మనకు మనమే సత్కరించుకోవడమేనని తెలిపారు. గౌతు కుటుంబానికి నమ్మిన బంటుగా పనిచేస్తూ పార్టీకి విశేషమైన సేవలందించారని తెలిపారు. ఎన్ని వదులుకొచ్చిన ఎన్ని ఒడిదులుకొచ్చిన నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని చెప్పారు. గతంలో టిడిపి పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ,పలాస ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్‌గా, 32 ఏళ్ల పాటు పార్టీకి సేవలందించినందుకు గాను ఈ పదవి దక్కినందుకు పలువురు అభినందించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ మురలీమోహన్ దొర, నవజ్యోతి సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, విశ్రాంతి పశువైద్య నిపుణులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# బత్తిని కుటుంబానికి బల్ల పరామర్శ



**పలాస, జనవరి 22 (వార్త):** బత్తిని రాజులమ్మ కుటుంబానికి కుటుంబానికి మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం పరామర్శించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు గ్రామం బత్తిని కృష్ణ మాతృమూర్తి బత్తిని రాజులమ్మ స్వర్గస్తులైనందున ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుని ప్రార్థిస్తూ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి దున్న సత్యం, ఢిల్లీరావు, జగ్గారావు, గ్రామ పెద్దలు వల్లభ వైకుంఠరావు, డి నాగభూషణం, పి.లక్ష్మణరావు, మొగిలిపాడు గ్రామ యువజనులు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి సాయం



**మందస, జనవరి 22(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి పేదలకు చేస్తున్న సాయం వెల కట్టలేనిది. వివిధ రకాలుగా అనాథలు, అభాగ్యులు, పేదలకు సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం చేస్తోంది. దీనిలో భాగంగా మందస మండలంలోని బేతాళపురం గ్రామానికి చెందిన సోడిపల్లి రాజేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేసింది. రాజేష్ కూలీ పని చేసుకోవడానికి బెంగళూరు వలస వెళ్ళాడు. అక్కడ ఆకస్మాత్తుగా అనారోగ్యం గురయ్యాడు. దీంతో ఆయనను శ్రీకాకుళం తీసుకువచ్చి, ఓ ప్రైవేటు హాస్పిటల్లో చికితసకోశం చేర్పించారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తుల సహకారంతో చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోయింది. రాజేష్ మరణించాడు. రాజేష్ కు సొంత ఇల్లు కూడా లేకపోగా పేదరికంతో బాధ పడుతున్న మృతుని కుటంబానికి అండగా సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిథులు రాజేష్ భార్య రాధిక, కుమార్తె దీక్షితకు రూ.10,000లు సాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు హరికృష్ణ, హేమావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన

**మందస, జనవరి 22(వార్త):** మందసలో రూ.50 లక్షల నిధులుతో మంజూరైన నూతన పీఏసీఎస్ భవనం నిర్మాణానికి పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, ఎంఆర్ ఇందిర, మండల సర్వేయర్ బొడ్డపాటి బాబూరావు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, కార్యదర్శి సాలిన మాధవరావు, దాసరి తాతారావు, ముంజేటి చంద్రశేఖర్, ముడిమించి నవీన్ కుమార్, రట్టి లింగరాజు, డొంకురు తిరుపతి, రాజాన మహేష్, మామిడి తాతారావు, గార కృష్ణారావు, తలగాన రాజశేఖర్, గువ్వాడ లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పలాసలో సామూహిక సూర్య నమస్కారాలు




**పలాస, జనవరి 22 (వార్త):** రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. మధు ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ సూర్య నమస్కారాలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని తెలిపారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు, జీర్ణ వ్యవస్థలో ఏర్పడే లోపాలను సరిదిద్దడంలో సూర్య నమస్కారాలు ఎంతో ఉపకరిస్తాయని వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు మాట్లాడుతూ సూర్య నమస్కారాల వలన శరీరంలోని రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెరిగి, శక్తి, ఉత్సాహం మరింతగా చేకూరుతాయని పేర్కొన్నారు. రథసప్తమి రోజున కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్, స్టాటిస్టిక్స్ విభాగాల ఆధ్వర్యంలో రూపొందించిన గూగుల్ షీట్?లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసి, సూర్య నమస్కారాలు చేస్తున్న వీడియోను అప్లోడ్ చేయడం ద్వారా వారికి సర్టిఫికెట్లు అందజేయబడతాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ పి.వెంకట రమణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యత : శిరీష



**మందస, జనవరి 22(వార్త):** పాడి రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని భిన్నళమదనాపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించినటువంటి గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శిరీష మాట్లాడుతూ పాడి రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈనెల 19నుంచి 31వ తేదీ వరకు జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్నటువంటి పశు బీమా పథకం, మినీ గోకులం, పశుగ్రాసాలు సాగు, సమీకృత దాణా పంపిణీ తదితర పథకాలు వినియోగించుకోవాలని కోరారు. పశువులను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు వాటి పెంపకం పట్ల అవగాహన పెంపొందించుకొని గర్భ కోశ వ్యాధుల పట్ల ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని, పోషకులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. పాడి పరిశ్రమ లాభసాటిగా సాగాలంటే లేగ దూడల పెంపకంపై పోషకులు ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రదర్శనకు తీసుకువచ్చిన దూడలను పరిశీలించి దూడల పెంపకందారులకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు, మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సిబ్బంది డాక్టర్ రాధాకుమారి, డాక్టర్ కిరణ్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, కుప్పాయి గోపాలరావు, ముడుమంచి నవీన్ కుమార్, సాలిన మాధవరావు, ప్రధాన మన్మధరావు, ఇతర నాయకులు, పశు సంవర్ధకశాఖ సిబ్బంది, పాడి రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

# సంపూర్ణ బోధన అభ్యసనకు ముఖ్యం

**మందస, జనవరి 22(వార్త):** సంపూర్ణ బోధన అభ్యసనకు ముఖ్యమని మందస మండల విద్యాశాఖాదికారి మర్రిపాటి లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం మెనూ పరిశీలించారు. విద్యార్థులు చేయు అభ్యసన కృత్యాలు పరిశీలించారు. నాలుగో తరగతి విద్యార్థులచే ఆంగ్ల పాఠ్య పుస్తకం చదివించారు. విద్యార్థులు ఆంగ్ల పాఠ్యపుస్తకం స్పష్టంగా ఎటువంటి తప్పులు లేకుండా చదవడం ఎంతో ఆసక్తికరంగా ఉందని మండల ఆయన తెలిపారు. ఆంగ్ల విద్యపై ప్రాథమిక స్థాయిలో పూర్తిస్థాయిలో సంపూర్ణమైన బోధన అభ్యసనకు చాలా ముఖ్యమని, విద్యార్థులు చదవడం, రాయడం, సామర్థ్యాలను పూర్తి చేయడం సంపూర్ణంగా ఉందని సంతృప్తి వ్యక్తపరిచారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులైన మెట్టు దామోదర్, సహాపాధ్యాయులు గంటా గోపాలకృష్ణ విద్యార్థులకు బోధించే విధానం చాలా ఆసక్తికరంగా, విభిన్నరీతులలోఉందని, ప్రాథమిక స్థాయిలో ఆంగ్లంలో మాట్లాడడం, ఆంగ్ల పుస్తకం చదవడం, విద్యార్థులు అభ్యసన కృత్యాలు చేయడం బాగుందన్నారు. క్యాంపస్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి పరీక్షల దృష్ట్యా పరీక్ష రాసే విధానంలో ప్రత్యేకమైన మెలకువలను తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు పాఠ్యాంశాన్ని ప్రశ్నకి జవాబులు ఎంత కష్టపడి చదువుతారో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అంత కష్టపడి రాయడం పది రెట్లు ఉండాలన్నారు. ఏ విద్యార్థి అయితే స్పష్టంగా అర్థవంతమైన రీతిలో పేపర్ ప్రజెంటేషన్ చేస్తారో ఆ విద్యార్థికి ఎక్కువ మార్కులు వస్తాయని, పరీక్షలో ఉన్నతమైన మార్కులు సాధించాలన్న, ఏ విద్యార్థి అయితే ప్రశ్న తగ్గట్టు జవాబులను పేపర్ ప్రజెంటేషన్ చేస్తారో అటువంటి విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని విద్యార్థుల ఉద్దేశించి చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, చిత్రసేన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బీఎస్ పురంలో మోడల్ పేపర్ల పంపిణీ



**మందస, జనవరి 22(వార్త):** బైరిసారంగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లను పంపిణీ కార్యక్రమఅం జరిగింది. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణతకు సహాయపడే పుస్తకాలను మందస సీఐటీయు యూనియన్ నాయకులు అందజేశారని, వీటిని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. యూటీఎఫ్ మందస కోశాధికారి సోమనాథ్ సిస్టు మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రచురణల విభాగం ఆధ్వర్యంలో నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులతో తయారు చేయబడిన యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు 34 మోడల్ టెస్ట్ పేపర్లను సీఐటీయు మందస మండలంలోని వివిధ పాఠశాలలకు 25 మోడల్ టెస్ట్ పేపర్లను సీఆర్పీఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ సాలిన వరిగాడు, అతని కుమారుడు సాఫ్ట్వేర్ ఇంజనీర్ సాలిన సందీప్ అందజేసారని తెలిపారు. సీఐటీయు మందస గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ సబ్జెక్టులో 4మోడల్ పేపర్లు చొప్పున ఉంటాయని, వీటిని బాగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చున్నారు. శత శాతం ఉత్తీర్ణతకు ఎంతగానో సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యదర్శి పాలిన సాయికుమార్, ఉపాధ్యాయులు ఎస్.ఆనందరావు, ఎం.అర్జునరావు, సేఐటీయు మండల కార్యదర్శి కె.కేశవరావు, రైతుసంఘం మండల అధ్యక్షుడు ఎం.ధర్మారావు, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ పాసేజీ పనులు పూర్తి చేయండి




**ఇచ్ఛాపురం, జనవరి 22 (వార్త):** ఇచ్చాపురం రైల్వే స్టేషన్ లో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా రోడ్ డివిజన్ డి ఆర్ ఎం అశోక్ త్రిపాఠి పర్యటించారు. జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రౌలో డి ఆర్ ఎం నుకలిసి ఇచ్చాపురం నార్త్ క్యాబిన్ వద్ద మంజూరైన ఆర?బి పనులు మొదలు పెట్టలని అలాగే జాడుపూడి రైల్వే స్టేషన్ నుండి ఇచ్చాపురం మధ్య ఆర్ యు బి మరియు ఇచ్చాపురం రైల్వే స్టేషన్ సురలా మధ్య ఆర్ యు బి పనులు మంజూరు చేసి ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ అవుతున్నందున తక్షణమే పనులు మొదలు పెట్టలని కోరారు. జాడుపూడి రైల్వేస్టేషన్లో బరంపురం నుండి విశాఖపట్నం ఎక్స్ప్రెస్ కు హాల్టు మంజూరు చేయమని కోరారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

# మందస రోడ్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయండి



**మందస, జనవరి 22(వార్త):** మందస రోడ్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని మందస రైల్వే స్టేషన్ అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పర్యవేక్షణకు వచ్చిన ఖుర్దా రైల్వే డివిజనల్ మేనేజర్ అశోక్ త్రిపాఠిను మందస రైల్వే స్టేషన్ అభివృద్ధి సాధన కమిటీ సభ్యులు కలిసి, మందస రోడ్ రైల్వే స్టేషన్ సమస్యలను ఆయనకు వివరించారు. మందస రోడ్ రైల్వే స్టేషన్ అభివృద్ధి, విశాఖ తదితర ఎక్స్ ప్రెస్ ట్రైన్ ల హల్టింగ్, ఈ మధ్యకాలంలో నడుస్తున్న బరంపురం-విశాఖపట్నం పాసింజర్ ట్రైన్ బరంపురం వరకు రాకుండా పలాస నుండి విశాఖపట్నం వరకు నడుపుతున్నారని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్ర ఆనందరావు, గొలుసు చంద్రశేఖరం, రౌతు చిరంజీవిరావు, ఇప్పిలి వెంకటరావు, గొలుసు మురలీకృష్ణ, సీపాన రాజు, సాలిన భీమారావు, సానా లింగేశ్వరరావు, బల్ల తిరుపతిరావు, కొత్ర వైకుంఠరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమస్యలను విన్న ఖుర్దా రైల్వే డివిజనల్ మేనేజర్ అశోక్ త్రిపాఠి సానుకూలంగా స్పందించారని, ఖుర్దా డివిజనల్ ఆఫీసుకు రావాలని చెప్పినట్టు అభివృద్ధి కమిటీ సభ్యులు చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 'మార్పు' కుటుంబానికి నాయకుల పరామర్శ



**మందస, జనవరి 22(వార్త):** బిన్నళమదనాపురం గ్రామానికి చెందిన మార్పు మన్మధరావు మామయ్య బొడ్డ రాఘవులు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మన్మధరావు కుటుంబాన్ని పరామర్శించారు. రాఘవులు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, పెద్దలు వల్లభ హరికృష్ణ, వల్లభ వైకుంఠరావు డి.నాగభూషణం, పాలవలస లక్ష్మణరావు, బిన్నళమదనాపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### -ఎమ్మెల్యే శిరీష -ఉద్దాన రైతు సంఘం నాయకులతో భేటీ -సమస్యలపరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ



**పలాస, జనవరి 22 (వార్త):** పలాస నియోజకవర్గ రైతులపై తనకున్న అపారమైన అభిమానాన్ని, సేవా భావాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష మరోసారి చాటుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను తన సమస్యగా భావించి, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఆమె స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం పలాసలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉద్దాన రైతు సంఘం నాయకులు ఆమెను కలిసి, జీడి పిక్కల గిట్టుబాటు ధర, ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉన్న వివిధ భూ సమస్యలను వివరించారు. రైతు నాయకులు చెప్పిన సమస్యలను ఎంతో ఓపికగా విన్న ఎమ్మెల్యే గౌతు శిరీష వారి ఆవేదనను అర్థం చేసుకుంటూ సానుకూలంగా స్పందించారు. రైతుల సంక్షేమం కోసం తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, సంబంధిత అధికా రులతో మాట్లాడి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, సమస్యల పరిష్కారానికి తాను ఎల్ల ప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీపై రైతు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారంపై పూర్తి భరోసా కలిగిందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఉదానం రైతు సంఘం నాయకులు బొడ్డపాడు మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచన, బొడ్డు సింహాద్రి, తామాడ క్రాంతి, కిక్కర ఢిల్లీరావు, మద్దిలి ధర్మారావు, దాసరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సుసరాంలో పశు వైద్య శిబిరం



**పోలాకి, జనవరి 22 (వార్త):** సుసరాం పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి చింతాడ షణ్ముఖరావు తెలిపారు. గురువారం నిర్వహించిన శిబిరంలో పశుపోషకులకు అవసరమైన పలు వైద్య సేవలను అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ శిబిరం సందర్భంగా 47 పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు అందించడంతో పాటు, 73 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా 250 గొర్రెలకు షిప్ ఫాక్స్ వ్యాధి నివారణకు సంబంధించిన వ్యాక్సిన్లను వేయించినట్లు తెలిపారు. పశువుల ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా ఈ శిబిరాలను గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్నామని, రైతులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి సూచించారు. శిబిరంలో సంబంధిత సిబ్బంది పాల్గొని పశువులకు అవసరమైన సేవలను అందించారు.

## రేపు మందసలో విద్యుత్ అంతరాయం



**మందస, జనవరి 22(వార్త):** మందస మండలంలో ఈ నెల 24న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు, మందస జూనియర్ ఇంజనీర్ లఖినాన దినకర్ చెప్పారు. మందస మండలంలోని హరిపురం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్డీఎస?స్ ఉద్దానం, బైఫుర్ కేషన్ పనుల జరుగుతాయన్నారు. హరిపురం టౌన్, బాలిగాం, ఉద్దానం, రట్టి, అంబుగాం, లొహరిబంద, నారాయణపురం, కుంటికోట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు, మందస జూనియర్ ఇంజనీర్ లఖినాన దినకర్ కోరారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత




**ఎల్ఎన్ పేట, జనవరి22(వార్త):** యంబరాం పంచాయితీ, బొడ్డవలస గ్రామానికి చెందిన కొర్ను సీమయ్య ఇటీవల సర్జరీ చేసుకోవడంతో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.35,000లు, పెద్దకోట పంచాయతీకి చెందిన జాడ గణేష్ గారికి రూ.80,643లు, కాగాన కృష్ణకు రూ.41,084లు, వియాపు జ్యోతి ప్రసాద్‌కు రూ.55,227ల చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం ఆదుకోవడం చాలా గర్వకారణం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదములు తెలిపారు. మండలంలో పలువురు కుటుంబ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయుకుల ద్వారా స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు గారి దృష్టికి తీసుకురాగా వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సిఫారసు చేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆ కుటుంబాలకు రూ.2,11,954లు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రవాణా చార్జీలు ఎప్పుడిస్తారు!



**మెళియాపుట్టి, జనవరి 22(వార్త):** రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ప్రక్రియకి సంబంధించి ప్రభుత్వం ఖాతాలలో నగదు జమ చేస్తున్నప్పటికీ వారికి రావలసిన రవాణా తదితర చార్జీలను ఎప్పుడుకి చెల్లిస్తారని ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ మండల సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. ఎంపీపీ రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా నిర్వహించారు. వ్యవసాయ శాఖ పద్దు పైసమావేశంలో మాట్లాడే క్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి డబ్బులు వారి వారి ఖాతాలో జమవుతున్నాయి గానీ వారికి రావాల్సిన రవాణా, గన్ని, లేబర్ చార్జీలను ఎప్పుడు లోపు రైతులకు వారి వారి ఖాతాలో జమ చేస్తారని సభ దృష్టికి తీసుకురాగా వ్యవసాయధికారి దానకర్ణుడు సమాధానం ఇస్తూ మండలంలో ఇప్పటివరకు 25వేల 613 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని దీనికి సంబంధించి రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం కూడా జరుగుతుందని తెలియజేస్తూనే త్వరలో రైతులకు రావాల్సిన చార్జీలను తదితర వాటి గురించి పై అధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో తము ఉండటంతో మహేంద్ర నది పై భాగంలో నున్న ఒడిస్సా ప్రాంతీయులు ఎక్కడికక్కడ నీటిని నిలువ చేసి ఒడిస్సా లో వేరే ప్రాంతాలకు తరలిస్తు మిగిలిన నిల్వ నీటిని దిగువ ప్రాంతాల్లో ఉన్న ఆంధ్ర ప్రాంతంలో ప్రాంతానికి విడిచి పెడుతుండటం వల్ల ఇక్కడ రైతులకు పంట చివర్లోపంటకు సరిపడ నీరు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇదే సమస్య గురించి అధికారులకు విన్నవించిన నేటికీన్ని ఎటువంటి కార్యరూపం దాల్చలేదని ఇప్పటికైనా ఉభయ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకులు దృష్టి సారించి నీటి సమస్య పరిష్కరించే దశగా కృషి చేయాలని కోసమాల ఎంపిటిసి సలాన జనార్ధన (చిట్టి) దృష్టికి తీసుకువచ్చారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి గ్రామాలలో రైతులకు సంబంధించి జీరో ఎక్స్ టెంట్ నేషనల్ ఖాతా తదితర వాటిని తహసిల్దార్ లాగిన్ ద్వారా పరిష్కారమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ తహసిల్దార్ రాము సభ దృష్టికి తీసుకుని వచ్చారు. ముకుందపురం గ్రామస్తులు రేషన్ సరుకులు సుందరాడ వెళ్లి తీసుకుని వస్తున్నారని వారికి డబారులో తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని, అలాగే జాడుపల్లి నుండి పట్టుపురం వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని వీటిని జాడిపల్లిలో తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ ప్రతినిధి పైడ్రాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల పద్దులపై సమావేశంలో చర్చించారు. ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖ, ఆర్ అండ్ బి, ఏపీ డీపీ వాటర్ షెడ్ పనులు, సామాజిక అటవీశాఖ, మత్స్యశాఖ తదితర శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరు పట్ల ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్కు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ రాము, వైస్ ఎంపీపీ ఆది నాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం

### -సుడా చైర్మన్ కొరికాన రవికుమార్



**మెళియాపుట్టి, జనవరి 22(వార్త):** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో జనసేన పార్టీలో ఉండి ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు జనసేన పార్టీ నాయకులు, శ్రీకాకుళం సుడా చైర్మన్ కోరికన రవికుమార్ అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో కమల కళ్యాణ మండపంలో గురువారం నాడు జరిగిన జనసేన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీమీ జీవితాలలో మీరు ముందుగా స్థిరపడండని మనం స్థిరపడిన నాడు మనం సమాజభివృద్ధికి కృషి చేయగలమని తెలియజేస్తూనే జనసేన పార్టీ ద్వారా దిశ దశ నిర్దేశం చేయగలిగే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని మండల స్థాయి నాయకత్వానికి తెలియపరచాలని, పదిమందితో కమిటీగా ఏర్పడి, గ్రామాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను గుర్తించడంతోపాటు వాటిని మా దృష్టికి తీసుకుని వస్తే వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని రవికుమార్ అన్నారు. కూటమి పార్టీలో ఉన్న మిగతా పార్టీలు జనసేన పార్టీ కార్యకర్తలను, నాయకులను విస్మరిస్తున్నారని కార్యకర్తలు సుడా చైర్మన్ దృష్టికి తీసుకుని రాగా దీనిపై రవికుమార్ స్పందిస్తూ రాబోయే భవిష్యత్ కాలంలో మన జనసేన పార్టీయే పెద్ద పార్టీ అని, ఒక పార్టీని నిలబెట్టిన ఘనత మరో పార్టీని పడగొట్టిన ఘనత మన జనసేన పార్టీకే ఉందని ఈ విషయాన్ని జన సైనికులు గుర్తుంచుకోవాలని, ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు మనోస్థాయిర్యాన్ని కల్పించారు. జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో మరింత బలపడేలా ప్రతి జనసేన పార్టీ కార్యకర్త కృషి చేయాలని తదుపరి పార్టీ అండగా నిలబడి మీ ప్రాంత, సమాజాభివృద్ధికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు తెలిపారు. భవిష్యత్తు కాలంలో పార్టీ చేపట్టబోయే అనేకంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవాని, జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, తిరునగరి ప్రసాద్, సలాన అప్పలనాయుడు మాస్టారు, లక్ష్మపురం కిరణ్, బిజెపి పార్టీ నాయకులు సలాన రాఘవరావు, నక్క వెంకట్రావు, బొచ్చు లక్ష్మణరావు, చంటి, ప్రశాంత్, హరికృష్ణ, మణికంఠ, సత్యనారాయణ రతో, ఈశ్వరరావు, సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శివనగర్‌లో తాగునీటికి తీవ్ర కొరత

### -నరసన్నపేట పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసుల ఆవేదన

**నరసన్నపేట, జనవరి 22(వార్త):** శివనగర్ కాలనీలో గత మంగళవారం నుంచి త్రాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మూడు రోజులుగా కనీసం ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా అయినా త్రాగునీటిని సరఫరా చేయకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్య అవసరమైన తాగునీటిని కూడా అందించడంలో మేజర్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మూడు రోజుల పాటు త్రాగునీరు లేకపోతే తాము ఎలా జీవించాలనే ప్రశ్నను శివనగర్ వాసులు లేవనెత్తుతున్నారు. నెల రోజుల్లోనే మూడు నుంచి నాలుగు సార్లు ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని వారు తెలిపారు. అనివార్య కారణాలు గానీ, మరమ్మత్తుల కారణంగా గానీ త్రాగునీటి సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో కనీసం ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడం అధికారుల నియంతృత్వ ధోరణికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికీ రేపటికైనా త్రాగునీటి సరఫరా పునరుద్ధరించే పరిస్థితి కనిపించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో తమ జీవనం దుర్భరంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తున్న పంచాయతీ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా మేజర్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని శివనగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రత్యేకంగా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




## బాల్య వివాహాల నిషేధంపై తీర్మానాలు



**ఇచ్ఛాపురం, జనవరి 22 (వార్త):** ఇచ్ఛాపురంలో బాల్య వివాహల నిషేధంపై ముక్త భారత్‌లో భాగంగా దేవాలయాల్లోనూ, చర్చిల్లోనూ, మసీదులోనూ తీర్మానాలు చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.రాజేశ్వరి పర్యవేక్షణలో స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయంలో, గొల్ల వీధి చర్చ్‌లో, లాలపేట మసీదులో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల సంప్రదాయంలో తీర్మానాలు చేశారు.

## దేశవానిపేట జడ్పీ పాఠశాల విద్యార్థులకు .. డ్రాయింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్



**నరసన్నపేట, జనవరి 22(వార్త):** దేశవానిపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ చాటుతూ గోల్డ్ మెడల్స్ సాధించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో నెల్లూరు అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ఈ పాఠశాలకి చెందిన ఐదుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.ఎన్.వి. ప్రసాద్ రావు తెలిపారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విజేతలైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కళాత్మక ప్రతిభను ప్రోత్సహించిన డ్రాయింగ్ ఉపాధ్యాయులు రాజేష్‌ను కూడా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కళా విద్యకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఫలితమే ఈ విజయం అని పలువురు ప్రశంసించారు. ఈ గోల్డ్ మెడల్స్ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పాఠశాల యాజమాన్యం అభిప్రాయం వ్యక్తం చేసింది.

## అంగూరు ప్రభుత్వ పాఠశాల తనిఖీ



**సారవకోట, జనవరి 22 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధన వారు సులభంగా అర్థం చేసుకునే రీతిలో కొనసాగాలని ఎంఈఓ-2 భూలక్ష్మి సూచించారు. గురువారం సారవకోట మండలంలోని అంగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించిన ఎంఈఓ, విద్యార్థుల హోంవర్క్‌లు, వర్క్‌బుక్కులను తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. పాఠ్యాంశాల బోధన పూర్తయ్యాక వెంటనే వర్క్‌బుక్కుల్లో నమోదు చేసే విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యం పెరిగేలా బోధన విధానాల్లో స్పష్టత, నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఎంఈఓ భూలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.


## పెద్దదూగాం జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీవో



**జలుమూరు, జనవరి 22 (వార్త):** పెద్దదూగాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో చిన్నమ్మొడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఆమె పరిశీలించి, దాని అమలు తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని ఎంపీడీవో సూచించారు. విద్యార్థుల ప్రగతికి అనుగుణంగా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని, పరీక్షలకు సమర్థంగా సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టడీ అవర్స్ సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పాఠశాల వాతావరణం చదువుకు అనుకూలంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

## తేజలక్ష్మికి కళా ప్రవీణ పురస్కారం

**జలుమూరు, జనవరి 22 (వార్త):** జలుమూరు జిల్లా పరిషత్ హై స్కూల్ రికార్డ్ అసిస్టెంట్ పల్లె తేజ లక్ష్మికి ప్రతిష్ఠాత్మకమైన కళా ప్రవీణ పురస్కారం లభించింది. బుధవారం రాత్రి విజయవాడ ఫిలిం ఛాంబర్‌లో శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా తేజ లక్ష్మి మాట్లాడుతూ, తన సాహిత్య రచనలకు లభించిన ఈ గౌరవం తనకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందన్నారు. ఒకవైపు విద్యా శాఖలో విధులు నిర్వహిస్తూ, మరోవైపు సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ ఈ స్థాయికి ఎదగడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.



## ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఆరుగురు అరెస్టు



**శ్రీకాకుళం క్రైం, జనవరి 22 (వార్త):** గార, శ్రీకాకుళం రూరల్, జెఆర్ పురం పోలీసు స్టేషన్ల పరిధితో పాటు ఎస్.కోట, డెంకాడ పోలీసు స్టేషన్లు పరిధిలోని ఆలయాలు, ఇతర ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని శ్రీకాకుళం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడిపు నాయుడు గురువారం తెలిపారు. గార పోలీసు స్టేషన్ పరిధిలో 3 కేసులు, శ్రీకాకుళం రూరల్ పరిధిలో 2 కేసులు, రణస్థలంలో 1 కేసు, డెంకాడలో 3 కేసులు, ఎస్.కోటలో 2 కేసులు చోరీలకు సంబంధించి నమోదయ్యాయన్నారు. చోరీలకు పాల్పడిన పట్నాల రంజీత్, కోలుసు దుర్గ ప్రసాద్, పట్నాల ఢిల్లీశ్వరరావు, చెల్లిబోయిన కామేశ్వరరావు, ముంత దుర్గ ప్రసాద్, కోలుసు శివ కుమార్‌లను పట్టుకున్నామన్నారు.



## నవ్వుల జల్లు.. నృత్యాల విందు

*** సందడిగా తొలి రోజు సాంస్కృతిక వేడుకలు**

**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** సిక్కోలు రథసప్తమి సందర్భంగా కే.ఆర్. స్టేడియంలో గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు కళాభిమానులను మంత్రముగ్ధులను చేశాయి. భారీ కళా వేదికపై ఏర్పాటు చేసిన ఈ వేడుకలు ఆద్యంతం కన్నుల పండువగా సాగాయి. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వేడుకల్లో భాగంగా తన్మయి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ బృందం ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను అలరించింది. శ్రీవాణి సంగీత కళాక్షేత్రం, ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ బృందాలు ఆలపించిన గీతాలు ఆహూతులను పరవశింపజేశాయి. ముఖ్యంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన కళాకారులు చేసిన నృత్యం వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### హోరెత్తిన కేరింతలు:

రాత్రి వేళలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలతో వేదిక దద్దరిల్లింది. జబర్దస్త్ ఫేమ్ 'బుల్లెట్ భాస్కర్' టీమ్ తమ కామెడీతో నవ్వుల పువ్వులు పూయించగా, ప్రజా గాయకుడు 'గోరెటి వెంకన్న' తనదైన శైలిలో పాటలు పాడి ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు. 'ఢీ' డాన్సర్ పార్కర్ బృందం చేసిన అద్భుతమైన నృత్య ప్రదర్శనలు యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి.

### వైవిధ్యభరిత ప్రదర్శనల సమాహారం:

ఈ వేడుకల్లో భాగంగా నాట్యశ్రీ నృత్యకళా నికేతన్ శ్రీలత బృందం, భారతి రమేష్ బృందం, అమిత్య, పి. తరుణి తమ గాన మాధుర్యంతో అలరించారు. వెంకటేష్ తన గళంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేయగా, సాయి లక్ష్మి ఇన్?స్టిట్యూట్ తరపున ఎస్. శ్రీనివాసరావు అందించిన సాక్సోఫోన్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ మ్యూజిక్ బ్యాండ్ అందించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. కన్నా డాన్స్ టీమ్ వరుస ప్రదర్శనలతో వేదికపై ఉత్సాహాన్ని నింపగా, వివిధ విడతల్లో జరిగిన మిమిక్రీ ప్రదర్శనలు ఆహూతులను కడుపుబ్బ నవ్వించాయి. కార్యక్రమం ముగింపులో ప్రదర్శనలు ఇచ్చిన ప్రతిభావంతులకు జిల్లా ఉన్నతాధికారులు జ్ఞాపికలను అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## అప్పలసూర్యనారాయణ విగ్రహం ఆవిష్కరణ



**అరసవల్లి, జనవరి 22(వార్త):** మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్య నారాయణ విగ్రహాన్ని అరసవల్లిలో గురువారం ఆయన తనయులు గుండ శివ గంగాధర్, గుండ విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గుండ అప్పలసూర్యనారాయణ నీతి, నిజాయితీలకు చిరునామా అన్నారు. రాజకీయాల్లో విలువలే శ్వాసగా, అజాత శత్రువుగా పనిచేసిన గుండ జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అరసవల్లికి గౌరవాన్ని, గుర్తింపును తీసుకువచ్చారని, ఆయన లేని లోటు తీరనిదన్నారు. కార్యక్రమంలో అరసవల్లి గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

## 'గుండ' కుటుంబానికి ధర్మాన పరామర్శ



**అరసవల్లి, జనవరి 22(వార్త):** మాజీ మంత్రి గుండ అప్పలసూర్య నారాయణ కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం అరసవల్లిలో వారి గృహంలో పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, తనయులను ఓదార్చారు. అప్పలసూర్య నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైసీపీ నేతలు ఉన్నారు.

## ఆర్టీసీ ఎండీని కలిసిన జిల్లా ఎస్పీ



**శ్రీకాకుళం, జనవరి 22 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమల రావు గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జిల్లా ఎస్పీని ఆర్టీసీ ఎండీ అభినందించారు.

## నేడు ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ పర్యటన

**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఈనెల 23న జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, గురజాడ, విజయనగరం, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, శ్రీకాకుళంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అలాగే కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

# అరసవల్లి వేడుకలను దిగ్విజయం చేయండి

*** రాష్ట్ర పండుగగా రథసప్తమి * అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి * అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం**

*** క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన**



**శ్రీకాకుళం, జనవరి 22 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఈ నెల 25న జరిగే రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో, ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన అరసవల్లి దేవస్థానాన్ని సందర్శించి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు సత్వర, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి సూచించారు. మంచినీరు, మజ్జిగ, ఉచిత లడ్డూ ప్రసాద పంపిణీ, విద్యుత్, పారిశుధ్యం విషయంలో ఎక్కడా చిన్న లోటు కూడా రానీయవద్దని, ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల



పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. దేవస్థానంలోని అన్ని సెక్టార్లను కలియ తిరిగిన మంత్రి, టికెట్ల విక్రయ కేంద్రాల గురించి భక్తులకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి 250 కి పైగా కెమెరాలతో జరుగుతున్న భద్రత పర్యవేక్షణను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. గతంతో పోలిస్తే ఈసారి ఏర్పాట్లు మెరుగ్గా ఉన్నాయని మంత్రి అధికారులకు కితాబిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ, విద్యుత్, పురపాలక శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండి, భక్తుల సేవలలో నిమగ్నం కావాలని కోరారు. ఈసారి ఉత్సవాల నిర్వహణలో నిర్వహణ నియమావళి పక్కాగా అమలు చేస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలని మంత్రి అధికారులకు సూచించారు. వ్యవస్థీకృతమైన ఈ విధానం వల్ల భక్తులకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవోలు, మిగిలిన యంత్రాంగంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మరో ఆరు నెలల్లో.. విద్యుత్ బస్సులు

*** చార్జింగ్ స్టేషన్లు నిర్మిస్తాం * సంక్రాంతికి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాం * సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు అమూల్యం**

*** ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు**







**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** మరో ఆరు నెలల్లో విద్యుత్ బస్సులను నడిపి ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్రాంతికి ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మంచి సేవలు అందించారన్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సాధించామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలులో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారని చెప్పారు. త్వరలో 1050 విద్యుత్ బస్సులను నడుపుతామని, వాటికి అవసరమైన చార్జింగ్ స్టేషన్లను నిర్మిస్తామన్నారు. సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సంస్థ మరింత అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో ఈ ఏడాది ఉత్తమ సేవలందించిన డ్రైవర్లను, ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఈడీ ఆపరేషన్స్ అంధవరపు అప్పలరాజు, ఈడీ విజయనగరం జోన్-1 విజయగీత, జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, విజయనగరం జోన్?-1 డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## 25న ప్రత్యేక బస్సులు

**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** రథసప్తమి వేడుకల సందర్భంగా ఈనెల25వ తేదీన ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి. సి. హెచ్. అప్పలనారాయణ గురువారం తెలిపారు. అరసవిల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో నిర్వహించబడే రథసప్తమి వేడుకల సందర్భంగా ప్రయాణీకుల సౌకర్యార్థం, విశాఖపట్నం, విజయనగరం, రాజాం, పాలకొండ, బత్తిలి, శ్రీముఖలింగం, పాతపట్నం, టెక్కలి, పలాస మొదలగు ప్రాంతాల నుండి శ్రీకాకుళం ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ఈనెల 25వ తేదీన ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో నడుపుతామన్నారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ నుండి డే అండ్‌నైట్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్, జిల్లా పరిషత్ మీదుగా పసగడ సూర్యనారాయణ మిల్లు వరకు ప్రతి 10 నిమిషములకు ప్రత్యేక బస్సులు ప్రయాణీకుల సౌకర్యార్థం సాధారణ చార్జీలతో నడపడం జరుగుతుందని తెలిపారు. పసగడ సూర్యనారాయణ మిల్లు నుండి శ్రీకాకుళం కాంప్లెక్స్ వరకు రావడానికి కూడా ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు.



## రథసప్తమి ఉత్సవాల భద్రత ఏర్పాట్ల పరిశీలన

**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాల నిర్వహణలో భాగంగా, శ్రీకాకుళం నగరంలోని కె.ఆర్. స్టేడియంలో జరుగుతున్న సాంస్కృతిక వేదికల నిర్మాణం, ఎగ్జిబిషన్ స్టాళ్ల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక మార్గాల కేటాయింపు, గ్యాలరీలు మరియు బారికేడ్ల పటిష్టత తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు వేలాదిగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, గ్యాలరీలు, సిట్టింగ్, బారికేడ్లను పూర్తిగా సురక్షితంగా, పటిష్టంగా ఉండాలని సూచించారు. 24 తేదీన జరగనున్న థమన్ మ్యూజికల్ షో వేదికను జిల్లా ఎస్పీ పరిశీలించి,ఎటువంటి లోటు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా తోపులాటలు లేదా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన కిడ్స్ ప్లే ఏరియా, అమ్యూజ్?మెంట్ పార్కులు, వేదికలను జిల్లా ఎస్పీ పరిశీలించి, పిల్లల భద్రతకు ఎటువంటి లోటు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాళ్లను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను క్రమబద్ధీకరించాలని, వాహనాల రాకపోకలను సమర్థవంతంగా నియంత్రించాలని సూచించారు. భక్తులు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో క్రిష్ణ మూర్తి, డీఎస్పీ వివేకానంద, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇమ్మనుయిల్ రాజు, రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, ఆర్?అండ్?బీ తదితర విభాగాలు అధికారులు పాల్గొన్నారు.




## అధికారులకే.. పాస్‌లు!

*** సాంస్కృతిక కార్యక్రమాల్లో వారి బంధువులకే అగ్రతాంబూలం * సామాన్య ప్రజలకు మాత్రం స్టాండింగ్ షో * కొందరు అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**శ్రీకాకుళం, జనవరి 22 (వార్త):** రథసప్తమి వేడుకలు సందర్భంగా కోడిరామ్మూర్తి స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వాటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డబ్బులు కూడా గట్టిగానే ఖర్చు పెడుతున్నారు. పెద్ద ఎత్తున వీవీఐపీ, వీఐపీ పాసులు కొట్టించారు. ఆ పాసులన్నీ కొందరు అధికారులు తమవద్దే ఉంచుకున్నారు. ఈ పాసులన్నీ తమవారికి, బంధువులకు, స్నేహితులు, శ్రేయోభిలాషులకే ఇప్పించుకున్నారు. దీంతో వారంతా ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ముందుండి తిలకించారు. ఇక సామాన్య ప్రజలకు మాత్రం ఈ ప్రదర్శనలు తిలకించడం కష్టంగా మారింది. దూరం నుంచి నిల్చొని చూడడం వీరి వంతైంది. అధికార అనుచరగణం కూర్చొని హాయిగా ఎంజాయ్ చేయగా, సామాన్యులు మాత్రం స్టాండింగ్ షోను చూస్తూ ఉసూరుమన్నారు. దీనిపై సిక్కోలు నగరవాసుల్లో విమర్శలు వెల్లువెతున్నాయి. రథసప్తమి వేడుకల్లో సామాన్యులకే పెద్దపీట అంటూనే అధికారులు, రాజకీయనేతలు దూరం పెడుతున్నారని బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.








Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546